సాక్షి
నిజామాబాద్
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



నెత్తురోడుతున్న హైవేలు..

63, 44వ నంబర్ జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయి. 15 రోజుల్లో ఐదుగురు మృత్యువాతపడ్డారు.

- 8లో ▸



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఏఆర్ ఏసీపీ కందునూరి నాగయ్య అన్నారు. యువత ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /19.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతవుతుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

వేముల వర్సెస్ మానాల



బీఆర్ఎస్, కాంగ్రెస్ విమర్శలు, ప్రతివిమర్శలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి కేంద్రంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని నిలువరించేందుకు అదేస్థాయిలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి మాటలదాడి చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతామని ప్రశాంత్‌రెడ్డి ప్రకటించగా, ఏడాదికాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని మానాల మోహన్‌రెడ్డి ప్రకటించారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వర్సెస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అనేలా మాటల దాడి, ప్రతిదాడి వ్యవహారం నడుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై గత కొన్ని నెలలుగా విమర్శల దాడిని పెంచుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు, మాజీ మంత్రి, బాల్కొండ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా ఎండగడుతున్నారు. రైతు రుణమాఫీ, బోనస్ చెల్లింపులు, ఆరు గ్యారంటీల విషయమై ప్రశాంత్‌రెడ్డి టాప్ గేర్‌లో విమర్శలు చేస్తూ ముందుకెళ్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బాల్కొండ నియోజకవర్గంతోపాటు రెగ్యులర్‌గా జిల్లా కేంద్రంలో పర్యటిస్తూ పార్టీ కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విమర్శల దాడిని మరింత పెంచారు. అన్నీతానై ప్రశాంత్‌రెడ్డి జిల్లా పార్టీకి సంబంధించి బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని దూకుడుగా వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. ప్రతి అంశంపై గణాంకాలతో మాట్లాడుతూ ప్రభుత్వంపై మాటల దాడి చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరును ఉధృతం చేయనున్నట్లు ప్రశాంత్‌రెడ్డి ప్రకటించారు.

విమర్శకు ప్రతివిమర్శ

బీఆర్ఎస్ నాయకుల విమర్శలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి వెంటనే ప్రతివిమర్శలు చేస్తూ కౌంటర్లు ఇస్తున్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేస్తున్న విమర్శలపై వెంటవెంటనే స్పందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాకు కేబినెట్ బెర్త్ కేటాయించడంలో ఆలస్యమవుతోంది. సీనియర్ నేత పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం ఖాయమైనప్పటికీ అధిష్టానం నుంచి మంత్రివర్గ విస్తరణపై గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో ఆలస్యమవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో సుదర్శన్‌రెడ్డికి అత్యంత సన్నిహిత అనుచరుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడి హోదాలో బీఆర్ఎస్ విమర్శలను బలంగా తిప్పికొడుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి అంశంపై మానాల సైతం లెక్కలతో సహా సమాధానాలు ఇస్తున్నారు. నువ్వా? నేనా? అనే స్థాయిలో మానాల దూకుడుగా వ్యవహిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి ఇద్దరూ బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వాళ్లే కావడంతో వీరిద్దరి విమర్శలు, ప్రతివిమర్శలు ఆసక్తి రేపుతున్నాయి.

గత శాసనసభ ఎన్నికల్లో బాల్కొండ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి విఫలమైన మానాల మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సైతం సన్నిహితుడిగా ఉన్నారు. టిక్కెట్ దక్కకపోవడంతో ముఖ్యమంత్రి కోటాలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, సుంకేట అన్వేష్‌రెడ్డి సైతం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ల పదవులు దక్కించుకున్నారు. అయితే నియోజకవర్గంపై ఫోకస్ మాత్రం మానాల మోహన్‌రెడ్డి మాత్రమే చేశారు. జిల్లా పార్టీ బాధ్యతలు చూస్తూనే బాల్కొండ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో శాసనసభ ఎన్నికల బరిలోకి నిలిచేందుకు మానాల మోహన్‌రెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన కానున్న నేపథ్యంలో అనువైన స్థానం నుంచి బరిలోకి దిగేందుకు మానాల ఇప్పటినుంచే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వేముల వర్సెస్ మానాల అన్నవిధంగా పరిస్థితి తయారైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అసంపూర్తిగానే రైతు రుణమాఫీ

- రైతుబంధు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని అసంపూర్తిగా చేసిందని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు రూ.40వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. అమలు చేసే పరిస్థితి వచ్చేసరికి 24 లక్షల మంది రైతులకు కేవలం రూ.20వేల కోట్ల రూపాయలను మాత్రమే మాఫీ చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలో 3,79,520 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా నాలుగు విడతల్లో 2,01,967 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1,77,553 వేల మంది రైతులకు రుణమాఫీ అవ్వాల్సి ఉందన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన రుణమాఫీతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది చాలా తక్కువ అని అన్నారు. కేసీఆర్ రూ.వెయ్యి కోట్లు ఎక్కువే రుణమాఫీ చేశారన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయించారని, దీంతో చాలా మంది రైతులు బోనస్ అందుకోలేకపోయారన్నారు. అమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యాన్ని ఆలస్యంగా కొనుగోలు చేయడం వల్ల బోనస్ తప్పించడం జరిగిందన్నారు. జిల్లాలో 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే ప్రభుత్వం ఐదు లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. జిల్లా రైతులకు రూ.600 కోట్లు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.90 కోట్లు మాత్రమే చెల్లించారని విమర్శించారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించిన రైతులకు సైతం ఎకరానికి 24 క్వింటాళ్ల చొప్పున దిగుబడిని లెక్కగట్టి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధును ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే జరిగితే ప్రజలు తిరగబడతారని అన్నారు. రైతులను నిండాముంచి రైతుపండుగ చేసుకోవడం బాగోలేదన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- విపక్షాల ఆరోపణలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



కాంగ్రెస్‌భవన్‌లో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: పదేళ్ల బీఆర్ఎస్ రాక్షస పాలనకు చరమగీతం పాడి ప్రజాపాలన అందిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిపై ఎవరితోనైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని, విపక్షాల తప్పుడు ఆరోపణలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని సూచించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఏర్పాటు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటలబీమా, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ వంటివి అమలు చేశామన్నారు. 50 వేల ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని మానాల తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 3 కోట్ల 26 లక్షల మంది లబ్ధి పొందారని, గృహజ్యోతి ద్వారా 2.47 కోట్ల కుటుంబాలకు జీరో బిల్లులు వస్తున్నట్లు వివరించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ఉత్తర తెలంగాణ రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్నా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రజలకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వాస్తవాలు గ్రహించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు జావేద్ అక్రం, రత్నాకర్, వేణురాజ్, రాజనరేందర్‌గౌడ్, సంతోష్, బొర్గాం శ్రీనివాస్, అఖిల్, శశికుమార్, సాయికిరణ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లైబ్రరీలో సౌకర్యాల పరిశీలన



వేల్పూర్: మండల కేంద్రంలోని లైబ్రరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ఆదివారం సందర్శించారు. లైబ్రరీలో సౌకర్యాలను పరిశీలించిన ఆయన నిరుద్యోగులు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాలవారు చదువుకోడానికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అని తెలుసుకున్నారు. అంతిరెడ్డి వేల్పూర్‌కు మొదటిసారి రావడంతో స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షు డు గడ్డం నర్సారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు గొరాయి నరేందర్, రమణ, రాజేందర్, మల్లయ్య, మోహన్, రాజేశ్వర్, వినోద్, ప్రవీన్, చిన్నయ్య, రహీం పాల్గొన్నారు.

హిందువులు సంఘటితంగా ముందుకెళ్లాలి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హిందువులు మరింత సంఘటితంగా ముందుకెళ్లాల్సిన ఆవశ్యకత పెరుగుతోందని విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్ పేర్కొన్నారు. ఆర్మూర్ రోడ్డులోని కంఠేశ్వర్ ఇస్కాన్ మందిరంలో అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆరాధన, భజనలు, కీర్తనలు, ప్రవచన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధాత్రిక రమేశ్.. మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న ఘటనలను చూసి ప్రతి భారతీయుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బంగ్లాదేశ్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఇస్కాన్ సంస్థ బాధ్యులపై అక్కడి ప్రభుత్వం దారుణమైన కేసులు పెడుతోందన్నారు. బంగ్లా హిందువులపై విచ్చలవిడిగా దాడులు చోటుచేసుకుంటున్నాయన్నారు. సనాతన ధర్మంపై అంతర్జాతీయ కుట్రలు భారీగా పెరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో భారత్‌లో హిందువులు మరింత ఐక్యంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు నరేశ్, బలరాందాస్ తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ చెక్‌పోస్ట్ తనిఖీ



రుద్రూర్: పోతంగల్ శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆదివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సూచించారు. ఇసుక అక్రమ రవాణకు ఎట్టి పరిస్థితుల్లో ఆస్కారం ఇవ్వవద్దన్నారు. పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. అంతకుముందు హంగర్గా గ్రామ శివారులోని మంజీరా వద్ద ఉన్న ఇసుక క్వారీని పరిశీలించారు. ఇసుక తరలింపులో నిబంధనలు పాటిస్తున్నారా.. ఎంత మేరకు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారనిగమనించారు. తహసీల్దార్ మల్లయ్య, మండల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జీతం రాకున్నా ఇక్కడే ఉంటా..

- వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దైనా మున్సిపాలిటీని వీడని ఉద్యోగి
- సొంత శాఖకు వెళ్లేందుకు విముఖత
- నోటీసు పంపిన డీఎంహెచ్‌వో

నిజామాబాద్ నాగారం: వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేసినా ఓ అధికారి మాత్రం ఇప్పటికీ తన సొంతశాఖకు రాకపోవడం చర్చనీయాంశమవుతోంది. వైద్యారోగ్యశాఖ ఉద్యోగి సోలోమాన్ డిప్యుటేషన్‌పై వెళ్లి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వాహనాల ఇన్‌చార్జి, డాగ్ స్క్వాడ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడు. డిప్యుటేషన్లు రద్దయిన నేపథ్యంలో వెనక్కి వచ్చేయాలని డీఎంహెచ్‌వో చెప్పినా ఆయన పెడచెవిన పెట్టడం గమనార్హం. తనకు వేతనం రాకున్నా ఇక్కడే పని చేస్తానని తోటి ఉద్యోగులతో ఆయన పేర్కొనడం చర్చనీయాంశమైంది. ఒక్కనెల వేతనం ఆలస్యమైతేనే తాము ఇబ్బందులు పడతామని, ఈయన మాత్రం ఐదు నెలలుగా వేతనం రాకున్నా ఇక్కడే కొనసాగుతున్నాడని చర్చించుకుంటున్నారు.

ఐదేళ్లుగా కార్పొరేషన్‌లోనే..

డీఎంహెచ్‌వో నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన సోలోమాన్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సుమారు ఐదేళ్లుగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, డంపింగ్‌యార్డు ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ డిప్యుటేషన్లను ఫిబ్రవరిలో రద్దు చేయగా, అందరూ సొంతశాఖకు వెళ్లిపోయారు.

అయితే సోలోమాన్‌తోపాటు నటరాజ్‌గౌడ్ అనే ఉద్యోగి వెనక్కి వెళ్లలేదు. వైద్యారోగ్య శాఖాధికారులు వేతనాలను నిలిపి మున్సిపల్ కార్యాలయానికి నోటీసు పంపించడంతో గత నెల 22న నటరాజ్‌గౌడ్ సొంతశాఖకు వెళ్లిపోయారు. డిప్యుటేషన్ రద్దయినప్పటికీ ఉద్యోగి వెనక్కి రాకపోవడంతో నోటీసులు ఇచ్చామని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి రాజశ్రీ స్పష్టం చేశారు.

పంటలపై చలి ప్రభావం

- మారిన వాతావరణం
- అధిక చలితో తెగుళ్లబారిన పంటలు
- ఎదుగుదల లోపించిన నారుమడులు



దత్తాపూర్ శివారులో ఎదుగుదల లేని నారుమడి

డొంకేశ్వర్(ఆర్మూర్): యాసంగి సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులకు ఆదిలోనే సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణంతో పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. అధిక చలి కారణంగా పోసిన నారుమడులు సక్రమంగా ఎదగడం లేదు. తెగుళ్లతో రంగుమారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మందుల కోసం పురుగుల మందు దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. ఎక్కువ డబ్బులు వెచ్చించి మందులు కొనుగోలు చేసి నారుమడులకు చల్లుతున్నారు. జిల్లాలో 4.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు నారుమ డులను సిద్ధం చేస్తున్న తరుణంలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. చలి ప్రభావం తగ్గే వరకు వేచి చూద్దామనే ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఇటు మొక్క దశలో ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలను సైతం తెగుళ్లు ఆశిస్తున్నాయి. అయితే నారుమడిని రక్షించుకోవడానికి పగటి పూట వెచ్చటి నీటిని అందించాలని, మంచు పడకుండా తాటిపత్రులు కప్పి ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ రైతులకు సూచిస్తున్నారు. అలాగే నారు ఆరోగ్యంగా పెరిగేందుకు యూరియాకు 2గ్రాముల కార్బండిజమ్‌తోపాటు మాంకోజెడ్ మిశ్రమాన్ని కలిపి చిరికారీ చేయాలన్నారు. ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింకు సల్ఫేట్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, కాండం తొలుచు పురుగు నుంచి కాపాడుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు ఎకరానికి సరిపడే నారుమడికి కిలో చొప్పున చల్లాలని సూచించారు.

తుపాను ప్రభావం... కల్లాల్లో వడ్లు

జిల్లాలో డొంకేశ్వర్‌తోపాటు పలు మండలాల్లో వరికోతలు ఇంకా అక్కడక్కడా పూర్తికాలేదు. ఇటు కోసిన పంట కూడా కొంత మేర కల్లాల్లోనే ఉంది. అల్పపీడనం కారణంగా జిల్లాలో సైతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పలు మండలాల్లో చిరు జల్లులు సైతం కురిశాయి. దీంతో కల్లాల్లో ధాన్యం ఉంచిన రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షం ముప్పు ఉండడంతో ధాన్యం కుప్పలు, సంచులపై టార్పాలిన్లు కప్పి ఉంచారు.

లక్ష్యానికి దూరంగా..

- సేకరించిన ధాన్యం 4.60 లక్షల మెట్రిక్ టన్నులే..
- నిర్దేశించింది 8 లక్షల మెట్రిక్ టన్నులు
- 150కి పైగా కొనుగోలు కేంద్రాల మూసివేత..
- రూ.850 కోట్లకుపైనే రైతుల ఖాతాల్లో జమ
- రూ.100 కోట్ల వరకు బోనస్ చెల్లింపు..



సుభాష్‌నగర్ : ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉన్నప్పటికీ.. లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. 90 శాతానికిపైగా సేకరణ పూర్తి కాగా, ఇప్పటి వరకు కేవలం రూ.4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. మరోవారం, పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు సేయనున్నారు. సుమారు 52 వేల మంది రైతులకు రూ.850 కోట్ల వరకు ధాన్యం డబ్బులు చెల్లించగా, 26,861 మంది రైతులకు రూ.99.51 కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేశారు.

■ జిల్లాలో ధాన్యం సేకరణ కోసం 676 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నరకాలు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 673 కేంద్రాలను ప్రారంభించగా, 65,425 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. 2.98 లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకాలు, దొడ్డు రకాలు 1.62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. ధాన్యం సేకరణ పూర్తి కావస్తుండటంతో ఇప్పటికే సుమారు 150 పైగా సెంటర్లను మూసేశారు.

5 లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటే..

వానాకాలం సీజన్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్న అధికారులు ఇప్పటి వరకు 4.60 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. కేంద్రాలు మూసేసే నాటికి 5 లక్షల మెట్రిక్ టన్నులు కూడా చేరుకోకపోవచ్చని భావిస్తున్నారు. వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్, ఎడపల్లి, మోపాల్ తదితర మండలాల్లో రైతులు పచ్చి ధాన్యాన్ని అమ్మేసుకున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, నల్గొండ, సూర్యాపేట్‌తో పాటు జిల్లాలోని రైస్‌మిల్లర్లు, వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేశారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించినప్పటికీ ఇస్తుందో.. లేదోనన్న సందేహంతో చాలా మంది రైతులు వ్యాపారులకు అమ్ముకున్నారు. తీరా ప్రభుత్వం బోనస్ జమ చేస్తుండటంతో ఆ రైతులంతా నష్టపోయారు. మరోవైపు పౌరసరఫరాశాఖ అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకోలేకపోయారు.

52వేల మంది రైతులకు చెల్లింపులు

రైతులు ధాన్యం విక్రయించి, సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించిన వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. ఎక్కడ కూడా జాప్యం జరగకుండా అధికారులు, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. 65,425 మంది రైతుల నుంచి 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఇప్పటికే 52 వేల మంది రైతులకు సుమారు రూ.850 కోట్ల వరకు చెల్లింపులు పూర్తి చేశారు. ట్యాబ్ ఎంట్రీ ఈసారి కొంత కఠినతరం చేయడంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

26,861 మందికి బోనస్..

ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ ప్రకటించిన ప్రకారం రైతులకు రూ.500 జమ చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 26,861 మంది రైతులకు రూ.99.51కోట్ల బోనస్ డబ్బులు జమ చేసింది. ధాన్యం మద్దతు ధర డబ్బులతో కాకుండా బోనస్ డబ్బులు వేరుగా జమ చేస్తున్నారు.

వారం రోజుల్లో కేంద్రాలు మూసేస్తాం..

జిల్లాలో 90 శాతానికిపైగా ధాన్యం సేకరణ పూ ర్తయినట్లే. చివరి గింజ వరకు ధాన్యం సేకరించి మరో వారం, పదిరోజుల్లో కొనుగోలు కేంద్రాలను మూసేస్తాం. నిర్దేశించిన లక్ష్యం మేరకు సేకరించకపోయినా.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా సేకరించాం. కడ్తా, తరుగు అనే పదాలకు తావివ్వకుండా రైస్మిల్లర్లు ధాన్యం దించుకున్నారు. – అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి

- రాష్ట్రంలో 90 శాతం కుల గణన సర్వే పూర్తి
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మూడో రాష్ట్ర విద్యా మహాసభలు ప్రారంభమయ్యాయి. షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధి కోసం తనను సలహాదారుగా నియమించిందన్నారు. అంబేద్కర్, పూలే ఆశయాలను కొనసాగించడానికి ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేయాలని కోరారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా తొమ్మిదేళ్ల కాలయాపన చేసిందని విస్మరించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘానికి గుర్తింపు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడతానన్నారు. రాష్ట్రంలో 90 శాతం కులగణన సర్వే పూర్తయ్యిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. ఆ సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. మహాసభల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, రాష్ట్ర కోశాధికారి సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడుతున్న రహదారులు

- 15రోజుల్లో ఐదుగురు మృతి
- ప్రమాదాలతో భయాందోళనల్లో వాహనదారులు
- జాతీయ రహదారి ఎక్కాలంటేనే జంకుతున్న వైనం



ఆర్మూర్‌టౌన్: జాతీయ రహదారులు ప్రమాదాలతో నెత్తురోడుతున్నాయి. ఆర్మూర్ ప్రాంతంలోని జాతీయ రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై గత 15 రోజుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందాడు. పట్టణంలోని 63, 44వ నంబరు జాతీయ రహదారులపై నిత్యం భారీ వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారులపై లారీలు, కంటైనర్లు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పనులపై బయటకు వెళ్లిన వారు ఇంటికి వచ్చే నమ్మకం లేకుండా పోతోంది. ఆర్మూర్ జాతీయ రహదారిపై గత 15రోజుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. వరుసగా చోటు చేసుకుంటున్న ప్రమాదాలు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే..

ఆర్మూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదలకు ముఖ్య కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ భారీ వాహనాలను నిలపడం, హఠాత్తుగా రోడ్డుపైకి రావడం, నిద్రమత్తులో ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా రవాణ శాఖ అధికారులు, పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- నవంబర్ 15న తొర్లికొండ ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో సోలం గంగాధర్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు.
- నవంబర్ 23న పిప్రిరోడ్డులో ఓ వాహనదారుడు నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొనడంతో రాకేష్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు.
- నవంబర్ 25న చేపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్ని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు.
- నవంబర్ 27న విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్‌సింగ్ మెడిసిన్ కోసం ఆర్మూర్‌కు వస్తుండగా పెర్కిట్ ఎక్స్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు.
- ఈనెల 1న పెర్కిట్‌లోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అశోక్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సిరిపురం అశోక్(55) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కిట్‌కు చెందిన అశోక్ వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 6 గంటలకు బైక్‌పై వెళ్తుండగా స్థానిక రిలయన్స్ పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.



అశోక్‌రెడ్డి (ఫైల్)

చర్యలు చేపడుతున్నాం



జాతీయ రహదారి కావడంతో వాహనాలు స్పీడుగా వెళ్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు డ్రంకన్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపడుతున్నాం. ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణగౌడ్, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్

క్లుప్తంగా

అంకాపూర్‌ను సందర్శించిన భైంసా విద్యార్థులు



పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని వాసవి పాఠశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. విద్యార్థులు గ్రామంలోని పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ గురడిరెడ్డి కాపు సంఘం సభ్యులు విద్యార్థులకు గ్రామ అభివృద్ధి, పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంకాపూర్ గురడిరెడ్డి కాపు సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, కేకే భాజన్న వాసవి పాఠశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఈ నెల 3న ఉదయం 7గంటలకు నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్‌లో సైక్లింగ్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలని కోరారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో చైత్రికకు చోటు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న పట్నం చైత్రిక ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ ముత్తు ఆదివారం తెలిపారు. గత నెల నవంబర్ 24న రవీంద్ర భారతిలో నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన విభాగంలో ప్రతిభ కనబర్చి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని చైత్రికను, తల్లిదండ్రులను అభినందించారు.

ఉమ్మడి జిల్లా కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన 2004-05 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నగరంలోని డీఆర్‌ఆర్ గెస్ట్ హౌస్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో పని చేస్తున్న వారు సమ్మేళనంలో ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. శిక్షణ సమయంలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సీఐలు నగేశ్, రవీందర్ నాయక్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నకిలీ వైద్యులను గుర్తించాలి

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎవరైనా పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తీసుకోవాలని, అలాగే నకిలీ వైద్యుల భరతం పట్టాలని దీనికి తాము సైతం సహకరిస్తామని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్ అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న చాత్తాద వైష్ణవ సంఘంలో నిజామాబాద్ మండల సర్వసభ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తమ పరిధిలో ఉంటు ప్రథమ చికిత్స చేసే వారిపై టీఎస్‌ఎంసీ వారు దాడులు చేస్తే తిరగబడతామని, పరిధి దాటి వైద్యం చేసిన వారిపై దాడులు చేస్తే సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వహీద్, పురుషోత్తం, రాములు, మురళి, నర్సయ్య, జహ్రుల్లా ఇంతియాజ్, మహిపాల్, బాలకృష్ణ, 120 మంది సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుల్గం మోహన్

క్రీడలతో మానసిక ఉల్లాసం



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారులు



విజేతలతో ఏఆర్ ఏసీపీ నాగయ్య

- ఏఆర్ ఏసీపీ కందునూరి నాగయ్య

నిజామాబాద్‌నాగారం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏఆర్ ఏసీపీ కందునూరి నాగయ్య అన్నారు. ఆదివారం నిజామాబాద్ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహిస్తున్న మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత ఫోన్లకు దూరంగా ఉండాలని, క్రీడలు ఆడితే మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. తెలంగాణ నేషనల్ మాస్టర్ ఫిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ మాస్టర్‌రెడ్డికి అసోసియేషన్ నిర్వహించిన ఈ టోర్నీకి ఎంతో ఆదరణ లభించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం క్రీడల్లో మెడల్ సాధించిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. టోర్నీలో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు నిజామాబాద్ జిల్లా మాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీను నాయక్, బద్దం గోపిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సీతారెడ్డి, విజయ్ కాంత్, ప్రభు కుమార్, రేఖా, రాణి, పల్లవి, ప్రతిభ, అనురాధ, సునీత, దశరథ్, గోపి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

ఆర్మూర్‌టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె శివసేనారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్న 46వ తెలగాణ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ క్రీడా పోటీల ముగింపు కార్యాక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని, త్వరలోనే నూతన క్రీడా పాఠశాలలను ప్రారంభిస్తామన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారిని నికత్‌జరీన్‌కు పోలీస్‌శాఖలో ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని కల్పించామన్నారు. త్వరలో నిర్వహించబోయే సీఎం కప్ విజయవంతం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్మూర్‌లో నూతన స్టేడియం నిర్మాణానికి త్వరలోనే కమిటీని ఏర్పాటు చేస్తామని, అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్‌ను నిర్మిస్తామని అన్నారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన ఆదిలాబాద్ జిల్లా జట్టు, ద్వితీయస్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు, తృతీయస్థానంలో వరంగల్ జిల్లా జట్టు, నాలుగో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, సీపీ రాజశేఖర్, హ్యాండ్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగామోహన్‌చక్రు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, పింజ సురేందర్, రాజేశ్, రమణ, కౌన్సిలర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. ఆదివారం జిల్లా వైద్య శాఖ, నిజామాబాద్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీజీహెచ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో గతంతో పోలిస్తే హెచ్‌ఐవీ కేసులు తగ్గాయని అన్నారు. హెచ్‌ఐవీ నివారణలో కృషి చేస్తున్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏడీఎం, డా దేవి నాగేశ్వరి, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు





ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు, బాలుర జట్టు..

నిజామాబాద్ నాగారం/దండేపల్లి: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17బాలబాలికల బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఉమ్మడి ఖమ్మం ప్రథమ బహుమతి, నిజామాబాద్ ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ ప్రథమ, ఖమ్మం ద్వితీయ, రంగారెడ్డి జట్టు తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మంచిర్యాల కార్యదర్శి ఫణిరాజా, ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పాఠశాల హెచ్‌ఎం రాజు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిలో యాజమాన్యం నిర్లక్ష్యం లేదు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కాకతీయ పాఠశాలలో రెండు రోజుల క్రితం మృతి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి శివ జశ్విత్‌రెడ్డి ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయలేదని కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ రజినీకాంత్ పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివ జశ్విత్‌రెడ్డి ఘటనకు ముందురోజు వాలీబాల్ ఆడుతూ ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. రెండు రోజులుగా అనారోగ్యంతో ఉన్నట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు. తరగతి బోధనకు హాజరై భోజనం కూడా చేసినట్లు తెలిపారు. 28న రాత్రి వాంతులు రాగా మాత్రలు అందించి అతని తల్లిదండ్రులతో మాట్లాడించినట్లు పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం విద్యార్థి తల్లిదండ్రులు రాగానే వారి కోసం మెట్లపై నుంచి వస్తు ఒక్కసారిగా పడడంతో కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు పక్కనే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని తెలిపారు. విద్యార్థి మృతి చెందడం బాధగా ఉందని, విద్యార్థి మృతిలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం లేదన్నారు.

టికెట్ విషయంలో కండక్టర్‌తో వాగ్వాదం

సదాశివనగర్: ఉచిత టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలు మహిళా కండక్టర్‌తో అరగంట పాటు వాగ్వాదానికి దిగిన ఘటన ఆదివారం మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. కామారెడ్డి నుంచి బాన్సువాడకు ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ సదాశివనగర్‌కు వస్తోంది. కాగా సదరు మహిళ వద్ద ఆధార్ కార్డు లేకపోవడంతో టికెట్ తీసుకోవాలని కండక్టర్ ప్రయాణికురాలిని సూచించింది. తన వద్ద టికెట్‌కు సరిపడా రూ. 20 లేవని చెప్పి కండక్టర్‌తో వాగ్వాదానికి దిగింది. సదాశివనగర్‌లో దిగిన సదరు మహిళ బంధువుల వద్ద డబ్బులు తీసుకొచ్చి కండక్టర్‌కు ఇచ్చింది. దీంతో గొడవ సద్దుమణిగింది.


క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాగారంలోని 80 క్వార్టర్స్‌కు చెందిన మీసాల కృష్ణ(44) టీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన భార్య విజయలక్ష్మితో గొడవ పడేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టాటాఏస్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారులోని సుభాష్‌నగర్ వంతెన వద్ద ఆర్టీసీ బస్సు, టాటాఏస్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఆర్మూర్ నుంచి నందిపేట్‌కు కొడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న టాటాఏస్ వ్యాన్ సుభాష్‌నగర్ వంతెన వద్ద ఢీకొన్నాయి. బస్సు వేగంతో రావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ వ్యాన్‌డ్రైవర్‌ను స్థానికులు అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేకాటస్థావరంపై దాడి

తాడ్వాయి: మండలంలోని చిట్యాలలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం పేర్కొన్నారు. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ.13,130 నగదు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్ధరాత్రి దుకాణాలు నడిపిన వారిపై కేసులు

ఖలీల్‌వాడి: నగరంలోని పలు వ్యాపార సముదాయాలు రాత్రి 11 గంటల తర్వాత తెరిచి ఉంచుతుండడంతో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మఫ్టీలో తిరిగి వ్యాపార యజమాన్యులపై కేసులు నమోదు చేశారు. నిబంధనల మేరకు రాత్రి 11 గంటల వరకు షాపులను మూసి ఉంచాలి. కానీ శనివారం రాత్రి ఏసీపీ నగరంలోని నగరంలోని పలు ప్రాంతాల్లో తిరిగి 11 మందిపై కేసులు నమోదు చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, బోధన్ రోడ్డు, నెహ్రూ పార్క్, ఖిల్లా రోడ్డు ప్రాంతాల్లో నడుస్తున్న హోటళ్లు, టీ దుకాణాలు, పాన్‌షాప్‌ల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. దీంతో ఏసీపీ అర్ధరాత్రి నడుస్తున్న వ్యాపారాలను కట్టడి చేసేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

సుపారి ఇచ్చి.. తనయుడి హత్య

- వేధింపులు భరించలేక ఘాతుకం
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రామన్

కామారెడ్డి క్రైం: వేధింపులు భరించలేక సొంత కొడుకును సుపారి ఇచ్చి హత్య చేయించాడు ఓ తండ్రి. కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని బ్రిడ్జి వద్ద జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన కోదండం రాజు(25) అనే యువకుని మృతదేహాన్ని రూరల్ పోలీసులు శనివారం గుర్తించిన విషయం తెలిసిందే. గుర్తించిన సమయంలో అతని మృతికి గల కారణాలు తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా మృతుడిని అతని తండ్రి హత్య చేయించినట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు దేవునిపల్లి పీఎస్‌లో ఆదివారం చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. గోసంగి కాలనీకి చెందిన కోదండం సాయిలుకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు రాజు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉంటున్నారు. రెండేళ్ల క్రితం రాజు గల్ఫ్‌కి వెళ్లి వచ్చాడు. మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను చెల్లెళ్లను వేధించేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో తండ్రి సాయిలు తన కొడుకు రాజును చంపాలని నిర్ణయించుకొని పట్టణానికి చెందిన అనిల్ అనే వ్యక్తితో రూ.లక్షకు సుపారి ఒప్పందం చేసుకున్నాడు. పథకం ప్రకారం అనిల్ ఈనెల 29న రాత్రి రాజుకు మద్యం తాగించి స్పృహ లేకుండా చేసిన తర్వాత బైక్‌పై ఉగ్రవాయి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేశాడు. కుటుంబ సభ్యులను విచారించిన పోలీసులు మృతుడి తండ్రి సాయిలు నేరం అంగీకరించడంతో అతడిని, అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి, ఎస్సై రాజు, సిబ్బంది రవి కిరణ్, శ్రీనివాస్ గౌడ్, రాజులను ఎస్పీ సింధు శర్మ, డీఎస్పీ నాగేశ్వరరావు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



అనిల్ (ఫైల్)

లింగంపేట: మండలంలోని పొల్కంపేటకు చెందిన బాసు అనిల్(35) పెద్దవాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అనిల్ నవంబర్ 28న బైక్‌పై రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. మరుసటి రోజు కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం పొల్కంపేట శివారులోని పెద్దవాగులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం అనిల్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ శివారులో పాడి లారీ, హార్వెస్టర్ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాడి లారీ కరీంనగర్ నుంచి ఆర్మూర్ వైపు వస్తోంది. అలాగే హార్వెస్టర్ ఆర్మూర్ నుంచి లాక్కోర వైపు వెళ్తుండగా పాడి లారీ, హార్వెస్టర్ ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు లారీ కింద ఇరుక్కోవడంతో అతన్ని బయటకు తీసేందుకు స్థానికులు, పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు సమాచారం. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



చెట్ల పొదల్లోకి వెళ్లిపోయిన లారీ

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు..



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో ఉన్న అయ్యప్ప ఆలయం వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడి రైతు కామ ఈర్వంత్ (40) మృతి చెందగా డ్రైవర్ అక్తర్‌కు గాయాలయ్యాయి. హజ్గుల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ పొగాకు బట్టీ కోసం కట్టెలు తీసుకొని వస్తుండగా అయ్యప్ప ఆలయం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈర్వంత్ ట్రాలీలో కట్టెలపై కూర్చున్నాడు. ట్రాక్టర్ రోడ్డుపై ప్రయాణిస్తుండగా జంప్ రావడంతో కట్టెలు, పెద్ద మొద్దులు ట్రాలీ నుంచి జారిపడ్డాయి. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వాటిపై ఉన్న ఈర్వంత్ కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.